రైతులు అధిక దిగుబడి సాధించాలి

గురిజాలలో పత్తి పంటను పరిశీలిస్తున్న ఏఈవో అశోక్

నర్సంపేటరూరల్, సెప్టెంబర్ 25: రైతులు వ్యవసాయంలో సస్యరక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడి సాధించాలని ఏఈవో మెండు అశోక్ అన్నారు. గురిజాల, చిన్నగురిజాల గ్రామాల్లో వరి, పత్తి పంటను బుధవారం ఏఈవో మెండు అశోక్ పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. రైతులు అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేసి దిగుబడి పెంచుకోవాలని సూచించారు. అధికారుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు.

ఏడుగురు ట్రైనీ ఎస్సైలకు స్టేషన్ అలాట్

సుబేదారి, సెప్టెంబర్ 25 : శిక్షణ పూర్తి చేసుకున్న ఏడుగురు ప్రొబేషనరీ ఎస్సైలను పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా బుధవారం రెండు విడుతలుగా పోలీసు స్టేషన్లకు అలాట్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పీ పవన్ కాజీపేట-మామునూరుకు, బీ హేమలత సుబేదారి-వర్ధన్నపేటకు, బీ శివ మిల్స్ కాలనీ-రఘునాథ్‌పల్లికి, బీ సుజిత్ ఆత్మకూరు-హనుమకొండ, ఏ మధు జనగామ-ఇంతేజార్‌గంజ్, ఎల్ దిలీప్ నర్సంపేట-హసన్‌పర్తి, పీ భాగ్యశ్రీ స్టేషన్ ఘన్‌పూర్-పరకాలకు అలాట్ అయ్యారు.

గీసుగొండలో జోనల్‌స్థాయి క్రీడాపోటీలు

గీసుగొండ, సెప్టెంబర్ 25 : జోనల్‌స్థాయి క్రీడా పోటీలను ఈ నెల 27, 28 తేదీల్లో మండలకేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో నిర్వహించనున్నట్లు పీడీ శ్రీనివాస్ తెలిపారు. గీసుగొండ, సంగెం మండలాల్లోని అండర్-14, అండర్-17 బాలబాలికలకు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. విద్యార్థులు ఆధార్‌కార్డు వెంట తీసుకొని రావాలని సూచించారు.

స్కూల్‌కు నీటిశుద్ధి యంత్రం అందజేత

ఫ్యూరిఫయర్‌ను ప్రారంభిస్తున్న రవికుమార్

చెన్నారావుపేట, సెప్టెంబర్ 25: మండలంలోని కోనాపురం ప్రభుత్వ పాఠశాలకు కాంట్రాక్టర్ నలబాల రవికుమార్ బుధవారం ఆర్వో వాటర్ ప్యూరిఫయర్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన కాంప్లెక్స్ హెచ్ఎం పాపమ్మతో కలిసి ప్రారంభించారు. అనంతరం పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన రవీందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు సురేందర్‌గౌడ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు వీరగంటి ఆంజనేయులు, ఆజాం, సుభాష్, సుష్మ, అశోక్, రవి, భాస్కర్, రాజేశ్, సీఆర్పీలు సంపత్, స్వామి పాల్గొన్నారు.

'ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తాం'

ప్రతిజ్ఞ చేస్తున్న పీఆర్టీయూ సభ్యులు

గిర్మాజీపేట, సెప్టెంబర్ 25: ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలను ప్రభుత్వంతో చర్చించి పరిష్కరిస్తామని పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగళి శ్రీపాల్‌రెడ్డి హామీ ఇచ్చారు. జడ్పీ హాల్‌లో ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, మాజీ ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండు లక్ష్మణ్ ఆధ్వర్యంలో బుధవారం పీఆర్టీయూ టీఎస్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అనంతరం ముఖ్య అతిథిగా హాజరైన శ్రీపాల్‌రెడ్డి సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షుడు ఈదునూరి రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మహ్మద్ అబ్దుల్ గఫార్, అసోసియేట్ అధ్యక్షులు కటకం రఘు, మహేందర్, మహిళా అసోసియేట్ అధ్యక్షులు అర్పిత, ఉపాధ్యక్షులు మల్లయ్య, సుధాకర్‌రెడ్డి, శంకర్‌రావు, మహిళా ఉపాధ్యక్షులు సుకన్య, కార్యదర్శులు రాజేందర్, సుభాష్, శ్రీనివాసరావు, ఎం.ఇంద్రసేనారెడ్డి, వెంకన్న, మహిళా కార్యదర్శి వినోదతో ప్రతిజ్ఞ చేయించారు.

'స్వచ్ఛత' జీవితంలో భాగం కావాలి

- మెరుగైన పారిశుధ్య పనులతోనే గ్రామాలు పరిశుభ్రం
- డీఆర్డీవో కౌసల్యాదేవి, జడ్పీ సీఈవో రాంరెడ్డి
- జిల్లాలో జోరుగా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం
- నెక్కొండలో పారిశుధ్య కార్మికుల కాళ్లు కడిగిన అధికారులు

చెన్నారావుపేట : ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీడీవో కార్యాలయ ఉద్యోగులు

నెక్కొండ, సెప్టెంబర్ 25: పచ్చదనం, పరిశుభ్రత ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని, అప్పుడే గ్రామాలు పచ్చదనంతో పరిఢవిల్లుతాయని డీఆర్డీవో కౌసల్యాదేవి, జడ్పీ సీఈవో, ఇన్‌చార్జి డీపీవో జి.రాంరెడ్డి అన్నారు. జిల్లావ్యాప్తంగా బుధవారం స్వచ్ఛతా హీ సేవా-2024 కార్యక్రమాలను జోరుగా నిర్వహించారు. ఇందులో భాగంగా నెక్కొండలోని జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొని గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్లు అయిన నెక్కొండకు చెందిన బస్కె శ్రీనివాస్, ముదిగొండకు చెందిన ఓరుగంటి ప్రమీల కాళ్లు కడిగి సత్కరించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికుల సేవలను కొనియాడారు. అనంతరం డీఆర్డీవో, జడ్పీ సీఈవో మాట్లాడుతూ గ్రామాల్లో నిత్యం పేరుకుపోతున్న చెత్తాచెదారాన్ని తొలగిస్తూ.. గ్రామాలను శుభ్రంగా ఉండటానికి, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు పాటుపడుతున్న జీపీ కార్మికులను మనమంతా గౌరవించాలని కోరారు. ప్రతి పంచాయతీలో స్వచ్ఛభారత్ మిషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, ప్రజల భాగాస్వామ్యం పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా ఆవరణలో మొక్కలు నాటారు. తర్వాత స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి అనురాధ, ఎంపీడీవో దయాకర్, ఎంఈవో రత్నమాల, నెక్కొండ కార్యదర్శి సదానందం, ఎంపీవో సునీల్, ఏపీవో జాకబ్, ఏపీఎం శ్రీనివాస్, మండల సమాఖ్య అధ్యక్షులు మార్త లావణ్య, సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

నర్సంపేటరూరల్: ప్రతి ఒక్కరూ పరిసరాల శుభ్రత పాటించాలని ఎంపీడీవో అంబాల శ్రీనివాసరావు సూచించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గురిజాలలో ప్రజలకు అవగాహన కల్పించారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రతను విధిగా పాటించాలన్నారు. కార్యక్రమంలో జీపీ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా గ్రామంలో మహాలక్ష్మి పథకం ధ్రువీకరణ పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీడీవో పరిశీలించారు.

ప్రజల భాగస్వామ్యంతోనే విజయవంతం

రాయపర్తి/ చెన్నారావుపేట : ప్రజల భాగస్వామ్యంతోనే ప్రభుత్వ పథకాలు విజయవంతం అవుతాయని రాయపర్తి ఎంపీడీవో గుగులోత్ కిషన్‌నాయక్ అన్నారు. మైలారంలోని జీపీ కార్యాలయ ఆవరణలో స్వచ్ఛతా హీ సేవా-2024 కార్యక్రమ లక్ష్యాలు, ఉద్దేశాలు, ఆశయాలపై గ్రామైక్య సంఘం సభ్యులు, మహిళా సంఘాల ప్రతినిధులకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ సిబ్బందిని సన్మానించారు. స్వచ్ఛతా హీ సేవా సెల్ఫీ పాయింట్‌ను ప్రారంభించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీవో కూచన ప్రకాశ్, ఐకేపీ ఏపీఎం రాపాక కిరణ్‌కుమార్, కార్యదర్శి పెంచల విజేందర్, కారోబార్ గూడెల్లి ఉప్పలయ్య, వీవోఏలు, అంగన్‌వాడీ టీచర్లు స్వప్న, సంది యమున, గబ్బెటి ప్రమీల, శ్వేత పాల్గొన్నారు. అలాగే, చెన్నారావుపేట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీవాణి ఆధ్వర్యంలో సిబ్బంది శ్రమదానం చేశారు. అనంతరం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంపై ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీధర్ రాజు, కార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాలసముద్రంలోని వెహికిల్ షెడ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మేయర్ సుధారాణి

వాహనాల మరమ్మతు త్వరగా చేయాలి

ఎమ్మెల్యే నాయిని, మేయర్ సుధారాణి

వరంగల్, సెప్టెంబర్ 25 : వెహికిల్ షెడ్‌కు వచ్చే వాహనాల మరమ్మతులను జాప్యం చేయకుండా వెంటవెంటనే చేయాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. బుధవారం బాలసముద్రంలోని వెహికిల్ షెడ్‌ను పరిశీలించారు. కాగా, షెడ్‌కు సరైన రోడ్డు లేకపోవడం వల్ల వాహనాలు లోపలికి వచ్చేందుకు ఆలస్యం అవుతున్నదని సిబ్బంది వారికి తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వెహికిల్ షెడ్‌లో సీసీ రోడ్డు ప్రతిపాదనలు ఉన్నాయన్నారు. త్వరలోనే రోడ్డు నిర్మాణం చేస్తామన్నారు. వాహనాల ఆలస్యంతో బాలసముద్రం రోడ్డులో స్వచ్ఛ ఆటోలు, కంపాక్టర్లు బారులు తీరి నిలువడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. సెకండ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లో చెత్త డంపింగ్ కోసం స్వచ్ఛ ఆటోలు వచ్చేందుకు ప్రత్యామ్నాయ మార్గం చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం పోతననగర్‌లోని ట్రాన్స్‌ఫర్ స్టేషన్ అందుబాటులోకి వచ్చిందన్నారు. కార్యక్రమంలో సీఎంహెచ్‌వో రాజేశ్, డీఈ సంతోష్‌బాబు, ఎలక్ట్రికల్ ఏఈ సంతోష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనిల్ పాల్గొన్నారు.

కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

బల్దియా ఎదుట కార్మికుల ధర్నా

వరంగల్, సెప్టెంబర్ 25 : కార్పొరేషన్‌లో పని చేస్తున్న మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సీఐటీయూ నాయకులు ఆరోపించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఉప్పలయ్య మాట్లాడుతూ.. సరైన పనిముట్లు, యూనిఫామ్స్, ఆప్రాన్, గ్లౌజ్‌లు ఇవ్వక పోవడంతో మూడేళ్లుగా కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఐడీ కార్డులు, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలన్నారు. అనంతరం బల్దియా అదనపు కమిషనర్ రాజేందర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బరుపట్ల మహేశ్, జన్ను ప్రకాశ్, బాబు, జీవన్, సునీత, శ్యామ్, నరేంద్రచారి, మాధవ్, కిశోర్ పాల్గొన్నారు.

నేడు పారిశుధ్య కార్మికులకు హెల్త్ క్యాంప్

వరంగల్, సెప్టెంబర్ 25 : స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా గురువారం గ్రేటర్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేసినట్లు సీఎంహెచ్‌వో రాజేశ్ తెలిపారు. ఇండోర్ స్టేడియంలో పారిశుధ్య కార్మికుల కోసం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఉదయం 9 గంటలకు మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ప్రారంభిస్తారని తెలిపారు.

'రాయపర్తి చెరువు పరిరక్షణ కోసం ఉద్యమిస్తాం'

కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ప్రజలు

రాయపర్తి, సెప్టెంబర్ 25: శతాబ్దాల కాలంగా మండల కేంద్రం ప్రజలకు తాగునీరు అందిస్తున్న మంచినీళ్ల చెరువు పరిరక్షణ కోసం రాజకీయాలకతీతంగా ఉద్యమిస్తామని రాయపర్తి మంచినీళ్ల చెరువు పరిరక్షణ కమిటీ ప్రతినిధులు స్పష్టం చేశారు. చెరువు నీళ్ల కల్తీకి కారణమైన శ్రీసత్యనారాయణస్వామి హెచరీస్ ఎదుట బుధవారం వారు ఆందోళన నిర్వహించారు. అనంతరం ర్యాలీగా తరలివెళ్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించి తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు రావుల భాస్కర్‌రావు, బండారి అశోక్, మాచర్ల పరమేశ్వర్, మచ్చ నీలయ్య, వేణు, మైస వెంకటేశం, సుధాకర్, కల్యాణ్, సింహాద్రి, నవీన్, శ్రీనివాస్, వెంకట్, కుమారస్వామి, ఆఫ్రోజ్, క్రాంతి, రాకేశ్, నర్సింహమూర్తి, చందు రామ్‌యాదవ్ పాల్గొన్నారు. అనంతరం మంచినీళ్ల చెరువును ఎస్సారెస్పీ డీఈ కిరణ్‌కుమార్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తానని ఆయన చెప్పారు.

వరంగల్ కలెక్టర్‌ను కలిసిన దసరా ఉత్సవ కమిటీ

కలెక్టర్‌కు ఆల్బమ్ అందజేస్తున్న సభ్యులు

కరీమాబాద్, సెప్టెంబర్ 25: ఉర్సు రంగలీలా మైదానంలో జరగనున్న సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలని ఉర్సు రంగలీలా మైదానం దసరా ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు బుధవారం వారు కలెక్టర్ సత్య శారదను మర్యాదపూర్వకంగా కలిసి ఆల్బమ్ అందజేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు నాగపురి సంజయ్‌బాబు, ప్రధాన కార్యదర్శి మేడిది మధుసూదన్, కోశాధికారి మండ వెంకన్నగౌడ్, సహాయ కోశాధికారి వెలిదె శివమూర్తి, ఉపాధ్యక్షులు గోనె రాంప్రసాద్, నాగపురి రంజిత్, పొగాకు సందీప్, దామెరకొండ వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శులు బజ్జూరి వాసు, సుంకరి సంజీవ్, పూదరి అజయ్, బత్తిని అఖిల్, నాగపురి అశోక్, కార్యదర్శులు నాగపురి మహేశ్, నరిగె శ్రీను, బొల్లం మధు, సభ్యులు బిట్ల క్రాంతి, నాగపురి నాగరాజు, పూజారి విజయ్, పార్వతి కృష్ణంరాజు, బత్తిని రంజిత్, మీరిపెల్లి వినయ్, మోడెం రాజశేఖర్, బైరగోని మనోహర్, కస్తూరి వంశీ, బోరిగం నాగరాజు, శ్రీరాముల చరణ్, గట్టు బాలసాయి, జయ మహేశ్ పాల్గొన్నారు.

'సమాధుల కూల్చివేతపై చర్యలు తీసుకోవాలి'

వరంగల్, సెప్టెంబర్ 25 : శాకరాసికుంట శ్మశాన వాటికలో కార్పొరేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో సమాధులను కూల్చివేసిన ఘటనపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం కార్పొరేషన్‌లో జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్, రాష్ట్ర నాయకుడు కుసుమ సతీశ్ ఆధ్వర్యంలో కమిషనర్ అశ్విని తానాజీ వాకడేను కలిసి వినతిపత్రం అందజేశారు.

ఎన్నికైన వారిని సన్మానిస్తున్న వివిధ సంఘాల నాయకులు

బల్దియా జేఏసీ అధ్యక్షుడిగా రమేశ్

వరంగల్, సెప్టెంబర్ 25 : బల్దియా ఉద్యోగ జేఏసీ అధ్యక్షుడిగా బొట్ల రమేశ్ ఎన్నికయ్యారు. బుధవారం కార్పొరేషన్ కౌన్సిల్ హాల్‌లో కోర్ కమిటీ సభ్యులు జేఏసీ గౌరవ అధ్యక్షుడు బిర్రు శ్రీనివాస్, ముఖ్య సలహాదారులు బొట్ల భిక్షపతి, ఏల్పుల ధర్మరాజు బల్దియా జేఏసీ అధ్యక్షుడిగా రమేశ్, ప్రధాన కార్యదర్శిగా బాకం సంతోష్‌కుమార్, కోశాధికారిగా కట్కూరి సజ్జన్ రాజు, కార్యదర్శిగా బానోత్ బాలు నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో రాజారపు భాస్కర్, పుల్లా రమేశ్, సీఐటీయూ నాయకులు జన్ను ప్రకాశ్, జీవన్, ఐఎన్‌టీయూసీ నాయకులు పాశం రవి, మేకల దేవేందర్ పాల్గొన్నారు.

పీఆర్సీ అమలు చేయండి

- 'ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు'లను రెగ్యులర్ చేయాలి
- టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ విజ్ఞప్తి

వేములవాడ, సెప్టెంబర్ 25: దేవాదాయశాఖ ఉద్యోగులకు ఇప్పటికే నాలుగు పీఆర్సీలు పెండింగ్‌లో ఉన్నాయని, కనీసం మూడింటిని ఈ పండుగలోగా విడుదల చేయాలని, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని, 261 జీవోను సవరించి ఉద్యోగులందరినీ ఒకే గొడుగు కిందికి తీసుకువచ్చి న్యాయం చేయాలని టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ పేర్కొన్నారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని హోటల్ ఎస్ఆర్ఆర్ గ్రాండ్‌లో రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల ఉద్యోగుల జేఏసీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ. దేవాదాయ శాఖలో 1975 నాటి క్యాడర్ స్ట్రెంత్‌నే ఇప్పటికీ అమలు చేస్తున్నారని తెలిపారు. ఆలయాల్లో భక్తుల రద్దీ, సౌకర్యాలను దృష్టిలో పెట్టుకొని ఐదేండ్లకోసారి క్యాడర్ స్ట్రెంత్‌ను రివైజ్ చేయాలని సూచించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో పారదర్శకత లోపించిందని ఆరోపించారు. 317 జీవో తీసుకొచ్చి జోనల్ వ్యవస్థలో బదిలీచేసి ఇబ్బందులకు గురిచేశారని పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యలపై త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తామని చెప్పారు.

రైతులకు కంగన క్షమాపణ

రైతు చట్టాలపై వ్యాఖ్యలు వెనక్కి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 25: తన దురుసు వ్యాఖ్యలతో నోరు పారేసుకున్న నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ రైతులకు క్షమాపణ చెప్పారు. 2021లో కేంద్రం రద్దు చేసిన మూడు రైతు చట్టాలను తిరిగి తేవాలంటూ ఆమె ఇటీవల వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. వివాదాస్పద రైతు చట్టాలపై తాను చేసిన వ్యాఖ్యలు చాలామందిని అసంతృప్తి, బాధకు గురి చేశాయని, దీనికి తనను క్షమించాలని ఆమె కోరారు. 'కొద్ది రోజుల క్రితం రైతు చట్టాలపై మీడియా నన్ను కొన్ని ప్రశ్నలు వేసింది. గతంలో రద్దు చేసిన మూడు రైతు చట్టాలను తిరిగి తేవాలని నేను ప్రధాని మోదీని కోరుతానని చెప్పా. అయితే నేను చేసిన ఈ ప్రకటన చాలామందిని బాధించింది. నా ప్రకటన వెనక్కి తీసుకుంటూ క్షమాపణలు చెబుతున్నా. నేనొక బీజేపీ కార్యకర్తను. నేను చేసే ప్రకటనలు పార్టీ అభిప్రాయాన్ని ప్రతిబింబించేవిగా ఉండాలి తప్ప, వ్యక్తిగతంగా ఉండకూడదు' అని ఆమె ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. కాగా, కంగనా చేసిన వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతమని, వాటికి పార్టీతో సంబంధం లేదని బీజేపీ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా అంతకుముందు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పైవేటు భవనానికి సర్కారీ సోకులు!

- శంషాబాద్ డబ్ల్యూటీసీ భవనంలో ఏఐ ఫెసిలిటీ సెంటర్
- అసంపూర్తి నిర్మాణంలో తాత్కాలిక కేంద్రం
- ట్రైసిటీల్లో అందుబాటులో సర్కారీ భవనాలు
- కపిల్ గ్రూపుతో ఐటీశాఖ ఒప్పందంపై ఆరోపణలు

ఫోర్త్ సిటీ.. 'ఫ్యూచర్' ట్రేడింగ్!

ప్రత్యేక కథనం - 8

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ): ఏఐ సిటీ ఫెసిలిటీ సెంటర్.. ఫోర్త్ అలియాస్ ఫ్యూచర్ సిటీలో 200 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న ఏఐ సిటీ నిర్మాణ కార్యకలాపాలను పర్యవేక్షించేందుకు ఏర్పాటు చేస్తున్న సెంటర్. అంటే తాత్కాలిక కేంద్రమన్న మాట. ప్రభుత్వ పరంగా టీ-హబ్, టీ-వర్క్స్, ట్రిపుల్ ఐటీ.. ఇలా చెప్పుకుంటూ పోతే లక్షల చదరపు అడుగుల్లో విశాలమైన , అద్భుతమైన భవనాలు అందుబాటులో ఉండగా అసంపూర్తి అద్దె భవనంలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎప్పుడు పూర్తవుతుందో తెలియని ఈ భవనంలో ఏఐ సిటీ ఫెసిలిటీ సెంటర్‌ను ఎందుకు ఏర్పాటు చేస్తున్నారనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగిలిపోయింది. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీకి రానున్న రోజుల్లో ఎంతో ప్రాధాన్యం ఉండనుందని కేసీఆర్ ప్రభుత్వం ఆదిలోనే గుర్తించింది. అందుకే హైదరాబాద్ వేదికగా ఏఐ గ్లోబల్ సమ్మిట్-2024 నిర్వహించేందుకు గతంలోనే చొరవ తీసుకుంది. కొన్నిరోజుల కిందట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఏఐ ప్రాధాన్యత దృష్ట్యా 'ఏఐ గ్లోబల్ సమ్మిట్-2024'ను నిర్వహించింది. ఈ క్రమంలోనే ఏఐ సిటీని ఏర్పాటు చేసేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్ణయించింది. అయితే, సిటీ నిర్మాణం పూర్తయ్యే వరకు కార్యకలాపాలు, పురోగతి, ఇతరత్రా వ్యవహారాలన్నింటినీ పర్యవేక్షించేందుకు ఒక కేంద్రం కావాలి. అదే ఏఐ సిటీ ఫెసిలిటీ సెంటర్. దీనిని ఏర్పాటు చేస్తున్నట్టు సమ్మిట్ వేదికగానే రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రకటించారు. కాకపోతే ఆ కేంద్రాన్ని శంషాబాద్‌లోని ప్రపంచ వాణిజ్య కేంద్రం (వరల్డ్ ట్రేడ్ సెంటర్)లోని రెండు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఇదే అందరినీ విస్మయానికి గురి చేసింది.

ఇంతకీ ఏమిటీ డబ్ల్యూటీసీ?

దేశంలోనే అతిపెద్ద వరల్డ్ ట్రేడ్ సెంటర్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్నామంటూ జూన్ 2022 నగరానికి చెందిన కపిల్ గ్రూపు ఆర్భాటంగా ప్రకటించింది. శంషాబాద్ విమానాశ్రయం తూర్పు ముఖం దగ్గర శ్రీశైలం హైవేను అనుకొని 50-60 ఎకరాల్లో 12 అంతస్తులతో కూడిన భవనాన్ని నిర్మిస్తామని చెప్పింది. ఇందుకోసం సుమారు రూ.4 వేల కోట్లను పెట్టుబడిగా పెడుతున్నట్టు ప్రకటించింది. కారణాలు ఏవైనా ఆ ప్రాజెక్టు ఇప్పటివరకు పూర్తి కాలేదు. కేవలం గ్రౌండ్ ఫ్లోర్ సహా మూడు అంతస్తులతో కూడిన రెండు టవర్ల నిర్మాణం మాత్రమే ఇప్పటికీ పురోగతిలో ఉంది. అంటే మూడేండ్ల కిందట మొదలుపెట్టిన ప్రాజెక్టు ఇప్పటికీ పూర్తి కాలేదు. ప్రస్తుతం వేగంగా పనులు కొనసాగించినా ప్రాజెక్టు పూర్తయ్యేందుకు మరో ఏడాది పట్టే అవకాశం ఉంది. ఇలాంటి అసంపూర్తి భవనాల్లో ఏఐ ఫెసిలిటీ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇదే ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

ఒప్పందంలోని షరతులేమిటో?

శంషాబాద్ విమానాశ్రయం తూర్పు వైపు నిర్మిస్తున్న డబ్ల్యూటీసీ శంషాబాద్ ప్రాజెక్టు మొదటి దశ నిర్మాణం వచ్చే ఏడాది అక్టోబర్ నాటికి పూర్తవుతుందని కంపెనీ చెప్పున్నది. అలాంటప్పుడు ఏడాది తర్వాత పూర్తయ్యే భవనంలో ఏఐ సిటీ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం గమనార్హం. ఆ మేరకు ఒప్పందం కూడా పూర్తయినట్టు తెలుస్తున్నది. అయితే, ఆ ఒప్పందంలో ఏముందనేది మాత్రం బయటికి రావడం లేదు. ఏడాదికి గాని పూర్తికాని భవనంలో తాత్కాలిక సెంటర్ ఏర్పాటు చేయాలనుకోవడం ఒక ఎత్తయితే, ఈ ఏడాది కాలంలో ప్రభుత్వం తరపున సదరు గ్రూపునకు ప్రభుత్వం కల్పించే ప్రయోజనాలు ఏమిటన్నవి తెలియరాలేదు. భవనం పూర్తయ్యాక సెంటర్ ఏర్పాటు చేస్తారా? లేదంటే భవనం పూర్తికి ప్రభుత్వ పరంగా ఆర్థికంగా చేయూత అందిస్తారా? అసలు ఆ భవనాన్ని ఎంచుకోవడానికి కారణం ఏమిటి? ఇలా అనేక సందేహాలు అందరి మెదళ్లను తొలుస్తున్నాయి. ఇందుకు సంబంధించి అన్ని వివరాలను పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలని నిపుణులు డిమాండ్ చేస్తున్నారు.

ఈ భూమాయకు సంబంధించిన వివరాలు మీ దగ్గర ఉంటే మాకు వాట్సాప్ చేయండి
91827 77711

టీ హబ్ కేంద్రంగా 60కి పైగా ఏఐ స్టార్టప్‌లు

కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన టీ-హబ్ అంతర్జాతీయస్థాయిలో టెక్నాలజీ స్టార్టప్‌లకు కేంద్రంగా మారింది. ఐటీ కారిడార్‌లో అత్యంత విశాలమైన ప్రాంగణంలో ఉన్న టీ-హబ్‌లో రకరకాల టెక్నాలజీ స్టార్టప్‌లు ఉన్నాయి. ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)కి సంబంధించిన టెక్నాలజీ స్టార్టప్‌లే 60కి పైగా ఉన్నాయి. ఇక్కడే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఏఐ స్టార్టప్‌లను ప్రోత్సహించేలా ప్రత్యేకంగా వ్యవస్థలు ఏర్పాటయ్యాయి. స్టార్టప్‌లకు, ఐటీ కంపెనీలకు ఎంతో అనుకూలంగా ఉండే ఏఐ ఫెసిలిటీ సెంటర్‌ను ఇక్